క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శాంతి నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సిద్ధార్థ, వీఐపీ, సత్రంపాడు, ఫిరంగులదిబ్బ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీబీ నటరాజన్ పేర్కొన్నారు. శాంతినగర్, ఆర్టీసీ కాలనీ, సత్రంపాడు మెయిన్ రోడ్డు, సీఆర్‌రెడ్డి విద్యా సంస్థల రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సానిగూడెంలో నిర్మాణాలు పూర్తి



సానిగూడెంలో నిర్మాణం పూర్తయిన ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్

దెందులూరు: సానిగూడెం గ్రామంలో రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.22 లక్షలతో వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రూ.40 లక్షలతో సచివాలయం భవనాల నిర్మాణం పూర్తయ్యాయని సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిధులు మంజూరు చేయించినందుకు చిరకాలం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేతులు మీదుగా ప్రారంభించనున్నట్టు సర్పంచ్ విష్ణు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్ అన్నారు.

ఎంపీడీఓను కలిసిన పంచాయతీ కార్యదర్శులు

పెదపాడు: పెదపాడు నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన జె.తేజరతన్‌ను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మేకా శ్రీనివాస్, ఎం వెంకటేశ్వరరావు, పీవీ రమణ, పద్మారావు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ

పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి పెదపాడు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన తేజరతన్‌కు గురువారం పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకుడు బత్తుల ఏసురాజు పాల్గొన్నారు.

వాడవాడలా అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఏలూరు సామాజిక సమత మహోత్సవాలు

ఏలూరు టౌన్: చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా విజయవాడ నడిబొడ్డున రూ.404 కోట్లతో 206 అడుగుల ఎత్తైన బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని రాష్ట్ర సర్కారు ఏర్పాటు చేసింది. ఆ మహాశిల్పాన్ని విజయవాడ స్వరాజ్ మైదానంలో స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమత మహోత్సవాలను నిర్వహించారు. ఏలూరు స్మార్ట్‌సిటీ మాజీ చైర్‌పర్సన్, మూడో డివిజన్ కార్పొరేటర్ బొద్దాని అఖిల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. 23వ డివిజన్‌లో కార్పొరేటర్ కలవకొల్లు సాంబ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, మహిళలు సామాజిక సాధికారతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. 13వ డివిజన్ ఇందిరా కాలనీ, వైఎస్సార్ కాలనీల్లో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు నిడికొండ నరేంద్ర ఆధ్వర్యంలో సమతా మహోత్సవం నిర్వహించి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. 49వ డివిజన్‌లో కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, 9వ డివిజన్ కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



9వ డివిజన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్



23వ డివిజన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, నాయకులు



3వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అఖిల



ఏలూరు 49వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్



శనివారపు పేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

అందరివాడు బీఆర్ అంబేడ్కర్

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడు అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక శనివారపుపేటలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ మేధావి అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి అంబేడ్కర్ విగ్రహం ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చేవిధంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక డ్వాక్రా మహిళలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవహారంగా ఏర్పడి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అద్దంకి హరిబాబు, గుడిపూడి శ్రీనివాస్, కె.రంగబాబు, డ్వాక్రా సీఓ షేక్ గౌసియా, సిటీ మిషన్ కో–ఆర్డినేటర్ సుధాకర్, శనివారపుపేటకు చెందిన పలువురు రిసోర్స్ పర్సన్స్, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ జీఓను రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న డ్రైవర్లు, హెల్పర్లు

భీమడోలు: కేంద్ర ప్రభుత్వం ట్రక్ ఆటో డ్రైవర్లపై తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ జీఓను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం జయహో రథసారథి డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా నాయకులు భీమడోలు జంక్షన్‌లో ఆందోళన చేశారు. దేశ వ్యవస్థకు మూలస్థంభాలైన డ్రైవర్లపై ఇలాంటి జీఓ తీసుకురావడం అన్యాయమని పేర్కొన్నారు. యాదృచ్ఛికంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లపై పెద్ద శిక్ష విధించడం దారుణమని వాపోయారు. రవాణా రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న తమకు జీవనోపాధి కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ జీఓను రద్దు చేయకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని జిల్లా నాయకులు పేరాబత్తుల శ్రీనివాసరావు, బి.అభి హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఇంటిపల్లి నాగేంద్రరావు, ఇండేటి గోవర్ధన్, చిన్నం నాగేశ్వరరావు, ఎం.విఘ్నేశ్వరరావు, కె.సురేష్, బి.శ్రీను, ఎస్ చంటి, పి.ఏసు, కల్యాణ్, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

పెదపాడు: గౌడ సేవా సమితి ద్వారా ప్రతి నెలా రెండు గౌడ పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఏలూరు గౌడసేవాసమితి జనరల్ సెక్రటరీ న్యాయవాది, బైగాని రంగారావు తెలిపారు. గురువారం వేంపాడు గ్రామానికి చెందిన చిట్టిమాది సాయి ప్రసాద్ కిడ్నీ వ్యాధితో జనవరి 1న మరణించడంతో వారి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న అమ్మపాలెం గ్రామానికి చెందిన బాలిన సురేష్‌కు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మార్గాని సురేష్ పరసా శ్రీనివాస్ పరసా నాగ శ్రీనివాసరావు, పరసా మోహన్ గౌడ్, నూతి రవిగౌడ్, సురగాని శ్రీనివాసరావు, వీరంకి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై అవగాహన

పెదపాడు: గ్రామ పంచాయతీ స్థాయిలో అభివృద్ధి ప్రణాళిక తయారీలో ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారులు అభివృద్ధి వీధి దీపాల నిర్వహణ, శానిటేషన్, వివిధ అభివృద్ధి పనుల నిర్వహణ వంటి వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాల అవసరాలు, వాటిని తీర్చేందుకు అమలు చేసే ప్రణాళికలను తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజ రతన్, ఈఓ ఆర్డీ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

సత్తాచాటుతున్న క్రీడాకారులు



ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న క్రీడాకారులు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారిణులు

ఏలూరు రూరల్ : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ప్రొఫెషనల్ క్రీడాకారులకు ఏ మాత్రం తీసిపోని విధంగా జట్లు ప్రతిభ, పాటవాలను ప్రదర్శిస్తున్నాయి. ఏలూరు ఇండోర్ స్టేడియంలో గురువారం ఉదయం క్రికెట్ పోటీలో జేపీ కాలనీ సచివాలయం జట్టుతో అరుంధతి కాలనీ సచివాలయం జట్టు తలపడి విజయం సాధించింది. మహిళల ఖోఖో అంశంలో గాంధీపార్కు సచివాలయ జట్టుపై రాజీవ్‌గాంధీ పార్కు సచివాలయ జట్టు గెలుపొందింది. బ్యాడ్మింటన్‌లో గొల్లాయిగూడెం సచివాలయం మహిళల జట్టు రామచంద్రరావుపేట సచివాలయం జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగంలో రాజీవ్‌గాంధీ పార్కు జట్టు చేపలతూము సచివాలయం జట్టుపై గెలుపొందింది. వాలీబాల్ బాలుర విభాగంలో శాంతినగర్ జట్టు విజేతగా నిలిచింది. పీఈటీలు ప్రతాప్, కె.మురళీకృష్ణ, భోగలింగేశ్వరావు, మురళీకృష్ణ, ప్రసన్న, పి.గోపీ, రమేష్ తదితరులు పోటీలు నిర్వహించారు.

వాలీబాల్ పోటీల్లో బాల్ కొడుతున్న క్రీడాకారుడు





ఖోఖోలో విజయం సాధించిన రాజీవ్‌గాంధీ పార్కు మహిళల జట్టు



బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన రాజీవ్‌గాంధీ పార్కు జట్టు



వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన శాంతినగర్ జట్టు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	బీన్లచిక్కుడు	90
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	60
బెండకాయలు	26	ములక్కాడలు	10-12
పచ్చిమిర్చి	44	కంద	60
కాకర కాయలు	50-56	బీట్‌రూట్	38
బీరకాయలు	50	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	64	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	24	అల్లం	120
క్యారెట్	64	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	28	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	08
దోసకాయలు	54	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	104
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	02
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	07
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	00
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్ఈఎల్	22.15	4822	01
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు – తిరుపతి	16.00	4830	రద్దు
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.40	98517	25
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.50	98501	14
ఏలూరు –తిరుపతి	16.00	4830	25

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కార్పొరేటర్ తంగెళ్ల రాము కొనియాడారు. గురువారం 15 డివిజన్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాము మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.20 లక్షల ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఎనలేని సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. సేవలు పొందే ప్రజలు ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అబ్బిరెడ్డి రంగముత్యాలు, ఎలగ అన్నవరం, కె.జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.



కళ్లజోళ్లు అందుకున్న పేదలు

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: మండలంలోని గుడిపాడులో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మంది వ్యక్తుల నుంచి రూ.46,160 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

కులగణన సర్వేకు ఏర్పాట్లు పూర్తి

నూజివీడు: నేటి నుంచి మండలం, పట్టణంలో నిర్వహించనున్న కులగణన సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వీపీ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ తెలిపారు. దీనిలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండే సెక్రటరీలకు క్లస్టర్‌లను కేటాయించామని, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే నిర్వహిస్తారన్నారు. తర్వాత సామాజిక, ఆర్థిక పరిస్థితులు అన్నింటిని నమోదు చేసుకుని యజమాని, వలంటీర్, సెక్రటరీలు ఈకేవైసీ చేస్తారని, అప్పుడే ఆ కుటుంబం కులగణన సర్వే పూర్తయినట్లన్నారు. కులగణనకు నూజివీడు మండలం వాలంటీర్లు, సెక్రటరీలు కలిసి దాదాపు 650 మందిని నియమించామన్నారు. అలాగే ఐదుగురు మండల స్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించినట్లు వివరించారు. పట్టణంలో దాదాపు 400 మందిని కులగణన సర్వేకు నియమించామన్నారు. నేటి నుంచి జరిగే కులగణన సామాజిక ఆర్థిక స్థితి సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు తోడ్పాటును అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రమణక్కపేట (ముసునూరు): కలసి చదువుకుని, స్నేహ పూర్వకంగా మెలిగి, నేడు వివిధ స్థాయిల్లో స్థిరపడిన మిత్రులంతా తమ అల్లర్లు, చిలిపి చేష్టలు, స్నేహ బంధాన్ని, ఆత్మీయతలను నెమరు వేసుకున్నారు. దీనికి రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ప్రస్తుత హెచ్ఎం రామకృష్ణ అధ్యక్షతన 1998–1999వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమ గురువులతో కలిసి గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి హెచ్ఎం కేవీఎస్ఆర్ ప్రసాదరావు మాట్లాడుతూ చిన్నతనంలో విద్య నేర్పిన గురువులు, సహచర విద్యార్థులను విద్యాలయానికి రప్పించి, తీయని జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం ఆనందదాయకమన్నారు. అలనాటి ఉపాధ్యాయులు 15 మంది, విద్యార్థులు 52 మంది హాజరుకావడం అరుదైన విశేషమన్నారు. అనంతరం తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యాలయ సౌకర్యార్థం రూ.12 వేలు విలువైన ఐరన్ బీర్వాను హెచ్ఎంకు అందజేశారు.

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ఆగిరిపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యాన పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వివేక్ ఠాకూర్ తెలిపారు. గురువారం మండలంలోని ఈదర సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఎంపీ పరిశీలించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీ వివేక్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ కేంద్ర పథకాలను ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, ఎంపీపీ గొళ్ల అనూష, డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠ, తహసీల్దార్ ఉదయ భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల నమోదు ప్రక్రియ



సోమశేఖర్, తహసీల్దార్

ఏలూరు రూరల్ : ఏలూరు నియోజకవర్గంలో ఓటర్లు నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించామని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. ఏలూరు కొత్తపేట 42 డివిజన్‌లో 79, 80, 82 పోలింగ్ కేంద్రాల్లో 50 మంది టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలిగించారంటూ కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన తెలిపారు. పైన పేర్కొన్న పోలింగ్ కేంద్రంలో చనిపోయిన వారి 13 ఓట్లు, ఎన్‌రోల్ అయిన 60 మంది డూప్లికేట్ ఓట్లు తొలిగించాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేశామన్నారు. ఇతర పోలింగ్ కేంద్రాలకు లేదా నియోజకవర్గాలకు తమ ఓటు మార్పు కోరుతూ 84 దరఖాస్తులు వచ్చాయన్నారు. పైన పేర్కొన్న మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో వచ్చిన 157 (ఫారం–7) దరఖాస్తులను పరిశీలించి, పక్కా ఆధారాలు సేకరించామని వివరించారు. ఓట్లు తొలిగింపు, కొత్త ఓటర్ల గుర్తింపుపై బీఎల్ఓలపై ఎలాంటి ఒత్తిడీ లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం విధి, విధానాలు అనుసరించి, నియోజకవర్గం అంతటా నిష్పక్షపాతంగా ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహించామని వివరించారు.